

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 14-09-2025 సంపుటి : 07 సంచిక : 125 పేజీలు : 8 వెల : రూ 3-00

# రాజకీయ ముసుగులో నేరాలను ఉపేక్షించకండి

**కొత్త తరహా నేరాలను సాంకేతికతతో అరికట్టండి**

**శాంతిభద్రతలతోనే రాష్ట్రానికి పెట్టుబడులు**

**జిల్లాల ఎసపీలతో సిఎం చంద్రబాబు**



అమరావతి,సెప్టెంబరు13 : రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ తనకు అత్యంత ప్రాధాన్యమైన అంశమని.... ఈ విషయంలో రాజీ అనేది లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. లా అండ్ ఆర్డర్ బాగుంటేనే పెట్టుబడులు వస్తాయి. ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయి. రాష్ట్ర గ్రోత్ రేట్ పెరుగుతుంది. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇదే నా విధానం అని సీఎం అన్నారు. జిల్లాల ఎస్పీల బదిలీ నేపథ్యంలో వారితో సీఎం సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతలు సహా పలు అంశాలపై ఎస్పీలకు దిశా నిర్ధేశర చేశారు. కొందరు ఎస్పీలు నేరుగా సమావేశానికి హాజరు కాగా... మరికొన్ని జిల్లాల ఎస్పీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాజకీయ ముసుగులో నేరాలను ఉపేక్షించకండి. నేరాల తీరు మారింది. కొత్త తరహా నేరాలు... కొత్త తరహా నేరస్తులు వచ్చారు. ఈ విషయంలో పోలీసులు కూడా అప్ డేట్ కావాలి. అప్పుడే శాంతి భద్రతలను పటిష్టంగా కొనసాగించగలమని సీఎం అన్నారు. అన్ని కోణాల్లో ఆలోచించి మీకు ఎస్పీలుగా అవకాశం ఇచ్చాను. బెస్ట్ ఫెర్మామెన్స్‌తో ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి. తొలిసారి సీఎం అయినప్పటి నుంచి నా ఫోకస్ లా అండ్ ఆర్డర్ మీదే ఉండేది. ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజం, మత ఘర్షణలు వంటి వాటి విషయంలో చాలా కఠినంగా ఉండేవాడిని. ఫ్యాక్షన్ అణిచివేత కోసం మా పార్టీ ప్రజా ప్రతినిధులను కూడా అరెస్టు చేసిన సందర్భాలు రాయలసీమలో ఉన్నాయి. అంత కఠినంగా ఉండడం వల్లనే నాడు ఫ్యాక్షన్‌ను దూరం చేయగలిగాం. ఫ్యాక్షన్‌లో ప్రాణాలు కోల్పోయిన వారి పిల్లలను ఎన్టీఆర్ మెమోరియల్ స్కూల్‌లో చదివించాను. వారు మళ్లీ ఫ్యాక్షన్ వైపు వెళ్లకుండా చర్యలు తీసుకున్నాను. నాడు తెలంగాణలో నక్సల్ విషయంలో చాలా భయంకరమైన పరిస్థితులు ఉండేవి.

# జిఎస్టీ సంస్కరణలతో ఔషధాల ధరలు తగ్గింపు

**క్యాన్సర్ మందుల ధరలు తగ్గుదలతో ఊరట**

**కార్లు, బైకుల ధరలు కూడా తగ్గిస్తూ ప్రకటనలు**

**22 తరవాత సిమెంట్,నిర్మాణ సామాగ్రి ధరలు తగ్గుదల**

**భారత ఆర్థికవ్యవస్థ 7.8శాతం వృద్ధిని సాధించిందన్న ప్రధాని మోడీ**



న్యూఢిల్లీ,సెప్టెంబరు13 (: తమ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సవరణలతో క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల మందుల ధరలు తగ్గుతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కార్లు, బైక్‌లను తయారుచేసే అనేక కంపెనీలు ఇప్పటికే ధరలను తగ్గించాయని.. సెప్టెంబర్ 22 తర్వాత సిమెంట్ నిర్మాణ సామగ్రి కూడా చౌకగా మారతాయని ప్రధాని తెలిపారు. వివిధ హోటళ్లపై జీఎస్టీని 5 శాతం తగ్గించడం వల్ల పర్యాటకులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈవిధంగా దేశంలోని అనేక కుటుంబాలపై భారం తగ్గించామంటూ వ్యాఖ్యానించారు. 2025-26 మొదటి త్రైమాసికంలో భారత ఆర్థికవ్యవస్థ 7.8శాతం వృద్ధిని సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా ద్వారా దేశం చేసే ఎగుమతుల్లో వృద్ధిని సాధించగలిగామన్నారు. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించారని ప్రధాని మండిపడ్డారు. 2014కి ముందు టూత్‌పేస్ట్, సబ్బు, నూనె వంటి రోజువారీ నిత్యావసర వస్తువులకు కూడా 27 శాతం పన్ను విధించేవారు. నేడు వీటిపై కేవలం 5శాతం జీఎస్టీ మాత్రమే వర్తిస్తుంది. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించడం వల్ల సాధారణ కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణ

చాలా ఖరీదైనదిగా మారిందని అన్నారు. మన ఆర్థికవ్యవస్థ తయారీ రంగం వృద్ధి మన జాతీయ భద్రతకు చాలా ముఖ్యమైనదన్నారు. ప్రజల సాధికారత ద్వారానే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో.. ఉగ్రవాదాన్ని పెంచి, పోషిస్తున్న వారికి భారత సైన్యం ఎలా బుద్ధి చెప్పిందో ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం మొత్తం చూసిందని ప్రధాని మోదీ అన్నారు. మన సాయుధ దళాలు చూపిన తెగువకు దేశం మొత్తం గర్వపడిందన్నారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ ఆయుధాలే మన దేశాన్ని రక్షించడంలో ముఖ్య పాత్ర పోషించాయన్నారు. మణిపుర్‌లో జాతుల మధ్య హింస చెలరేగిన రెండు సంవత్సరాల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి ఆ రాష్ట్రంలో నేడు పర్యటించనున్నారు. దీనికి ముందు మిజోరంలో పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

# సుపరిపాలన వేళ వైషమ్యాల కుట్రలు



**జనసైనికులు అప్రమత్తంగా ఉండాలి**

**డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ పిలుపు**

అమరావతి,సెప్టెంబర్13 రాష్ట్రం అభివృద్ధి దిశగా.. సంక్షేమ ఫలాలు ప్రజలకు అందిస్తూ సుపరిపాలన సాగిస్తున్నామని అలాంటి వేళ ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించేందుకు కుట్రలు మొదలయ్యాయని డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి కుట్రలకు పాల్పడే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ జనసేన పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు. వారు చేసే దుష్ప్రచారాన్ని ప్రజాస్వామ్య యుతంగా, చట్ట ప్రకారం తిప్పికొడదామని పార్టీ శ్రేణులకు డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ పిలుపు నిచ్చారు. శనివారం అమరావతిలోని పార్టీ కార్యాలయంలో జనసేన శ్రేణులను ఉద్దేశించి డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల ముసుగులోనో.. యూట్యూబ్ ఛానెళ్ల పేరుతోనో.. మరో మార్గంలోనో కులాలు మధ్య, మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా కుయుక్తులతో సమాజంలో అశాంతి, అభద్రత కలిగించే వ్యక్తుల నైజాన్ని గత పదేళ్లుగా చూస్తున్నామని ఆయన వివరించారు. వారి ఉచ్చులో పడి, ఆవేశాలకు లోనై, ఘర్షణ వాతావరణానికి తావీయ వద్దంటూ పార్టీ శ్రేణులకు ఆయన హితవు పలికారు. అలాంటి ఆవేశాలు ప్రదర్శిస్తే కుట్రదారులు ఆశించిన ప్రయోజనాలు నెరవేరుతాయన్నారు. ఆ క్రమంలో ఇటీ-వల మచిలీపట్నంలో చోటు- చేసుకున్న ఘటనను ఈ సందర్భంగా ఆయన ఉదాహరణగా వివరించారు. ఒక యూట్యూబ్ ఛానెల్‌లో వ్యక్తి అభ్యంతరకర భాష ఉపయోగించి మాట్లాడారని చెప్పారు. అతను ఆ విధంగా మాట్లాడేలా సిద్ధం చేసి.. ప్రచారం చేయడం వెనక ఉన్న కుత్సిత ఆలోచనను మనం పసిగట్టాల్సి ఉందని పార్టీ శ్రేణులకు డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. ఈ అంశంపై చట్ట ప్రకారం కేసులు పెట్టి ముందుకు వెళ్ళాల్సి ఉందని సూచించారు. అంతేకానీ.. తొందరపడి మరో మార్గంలో వెళ్ళి ఘర్షణ పడటం ద్వారా సమస్య జటిలం అవుతుందని అభిప్రాయ పడ్డారు. కులాలు, మతాల మధ్య విభేదాలు తీసుకు వచ్చే విధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేయాల్సి ఉందంటూ పార్టీ శ్రేణులకు ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా ముందుకు వెళ్ళాలని జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలతోపాటు- కూమిటీ-లోని నేతలను సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. సోషల్ మీడియా, యూట్యూబ్ చానెల్స్ రూపంలోనో, విశ్లేషకుల ముసుగులోనో రెచ్చగొట్టే వారినీ, అభ్యంతరకర రీతిలో మాట్లాడే వారినీ భారత న్యాయ సంహిత ప్రకారం చట్టం ముందు నిలపాలని పేర్కొన్నారు. వీరి వెనక ఉండి.. వ్యవస్థీకృతంగా రెచ్చగొట్టి కుట్రలు చేసే వారిపైనా ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయించాలని పార్టీ కేడర్‌కు ఆయన సూచించారు. అయితే మచిలీపట్నం వివాదంపై అంతర్గత విచారణ జరపాలంటూ ఇప్పటికే పార్టీలోని నేతలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని వెల్లడించారు. ఈ ఘటనలో పాలు పంచుకున్న వారికి నోటీ-సులు ఇచ్చి వివరణ తీసుకోవాలని కూడా ఇచ్చానని వివరించారు. కుట్రలు చేసే వారి కుత్సిత నైజం కలిగిన పార్టీ, ఆ పార్టీ నాయకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ రాజకీయ పార్టీలు సోషల్ మీడియా ముసుగులో అనుసరిస్తున్న వైఖరిపై జనసేన పార్టీ కేడర్‌కు ఈ సందర్భంగా డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ అప్రమత్తం చేశారు.

# దేశాభివృద్ధిలో మిజోరం భాగస్వామ్యం కీలకం

**యువత ఇందులో భాగస్వామ్యం కావాలి**

**మిజోరంలో రూ.9వేల కోట్లతో పలు అభివృద్ధి పనులు**

**ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ**

గ్యాంగ్‌టక్,సెప్టెంబరు13 : దేశాభివృద్ధిలో మిజోరం భాగస్వామ్యం కీలకమని ప్రధాని మోడీ తెలిపారు. కొండమార్గంలో రైలు మార్గం కష్టతరంలో కూడుకున్నదని, సవాల్‌తో కూడిన నిర్మాణాలు అద్భుతమని కొనియాడారు. మిజోరంలో రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టారు. వర్చువల్‌గా అభివృద్ధి పనులను పిఎం మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఈ రైల్వే లైన్లు భారతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానమవుతాయని, పర్యాటక రంగంతో ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉందని తెలియజేశారు. ఏ రాష్ట్రాభివృద్ధికైనా రోడ్డు, రైల్వే, పోరు కనెక్టివిటీ- ముఖ్యమని స్పష్టం చేశారు. మిజోరం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, వేగవంతమైన దేశాభివృద్ధిలో మిజోరం యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మిజోరంలో రవాణా సౌకర్యాలు పెంచామని, నూతన రైళ్ల ప్రారంభోత్సవంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడుతాయని మోడీ వివరించారు. కష్టతరమైన కొండ ప్రాంతాల్లో రైల్వే సౌకర్యం సంతోషకరమైన విషయమన్నారు.






# వచ్చే జూన్‌లో ఎగరనున్న విమానాలు



**తుదిదశకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులు**

**పనులను పరిశీలించిన మంత్రి రామ్మోహన్ నాయుడు**

విజయనగరం,సెప్టెంబరు13 : భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి విమాన సర్వీసులు 2026 జూన్‌లో ప్రారంభమవుతాయని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఇప్పటికే శరవేగంగా పనులు పూర్తవుతున్నాయని అన్నారు. విమానాశ్రయ నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. పనుల పురోగతి, పూర్తికావాల్సిన నిర్మాణాలు, తదితర అంశాలపై నిర్మాణ సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్ని సవాళ్లు ఎదురైనా జీఎంఆర్ సంస్థ పనులు ఆపడం లేదన్నారు. ఓ వైపు వర్షాలు కురుస్తున్నా ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు మాత్రం కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు 86 శాతం ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తయిందని చెప్పారు. విశాఖ నుంచి రోడ్డు కనెక్టివిటీ-కి సంబంధించి అనేక సార్లు సమీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 7 పాయింట్లు- గుర్తించామని చెప్పారు. మార్చి, ఏప్రిల్‌లోగా ఈ రహదారి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎలివేటెడ్ కారిడార్ కూడా ప్రతిపాదనలో ఉంది. బీచ్ కారిడార్ నిర్మాణం కోసం కూడా డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం. విశాఖ నుంచి కొచ్చికి కనెక్టివిటీ- కోసం వినతులు వచ్చాయి. విశాఖ నుంచి అంతర్జాతీయ కనెక్టివిటీ- పెంచేందుకు దృష్టి సారించామని రామ్మోహన్ నాయుడు తెలిపారు.రన్ వే, ఎర్త్ వర్క్, ట్యాక్సీ స్టాండ్ 100 శాతం పనులు అయ్యాయని.. -టె-ర్మినల్ 79, ఏటిసి 90, బిల్డింగ్స్ 62, కనెక్టింగ్ రోడ్లు 68 శాతం పూర్తయిందని వెల్లడించారు.

# సంపాదకీయం

ఆదివారం 14-09-2025

## విమోచన అంటే ఉలికిపాటు ఎందుకో?

తెలంగాణ విమోచన అనగానే పాలకులు ఉలిక్కిపడుతున్నారు. ఏదో పేరు పెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని కూడా జరుపుకోవడానికి జడుస్తున్న నేతలు ఉన్నందుకు మనం సిగ్గుపడాలి. బాజాప్తా ఎందుకు విమోచన జరపలేక పోయారో తగ పాలకులు, నేటి పాలకులు సమాధానం ఇచ్చుకోవాలి. నిజాం నిరంకుశాలను, రజాకార్ల ఆగడాలను ఎదరించడానికి జరిగిన పోరాటం ముమ్మాటికి తిరుగబాటుచరిత్రే అవుతుంది. చైనా,రష్యాల్లో జరిగిన పోరాటలకు ఇది తక్కువేం కాదు. అయినంత మాత్రాన విమోచన దినోత్సవంజరపరాదని అన్నవాళ్లు మూర్ఖులు కాక మరోటి కాదు. దీనిని విస్మరించేలా చేయడం పాలకులకు మంచిది కాదు. ఖాసింరజ్వీ ఘాతుకాలకు అంతులేని చరిత్ర ఉంది. అదంతా చదువుతుంటే రక్తం మరిగిపోతుంది. నిజాం గురించి, ఆ పాలన గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. విముక్త తెలంగాణ జరిగిన సెప్టెంబర్17న విమోచన ఉత్సవాలు జరుపుకోవాలన్న ఆకాంక్షలను గత ప్రభుత్వాలతో పాటు, తెలంగాణ ప్రభుత్వం కూడా విస్మరించడం ద్వారా చరిత్రను అపహాస్యం చేస్తూ వస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత దీనిని ఘనంగా జరపాల్సిన ప్రభుత్వం దానిని దాటవేయడం ద్వారా ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. దీనిపై తెలంగాణ ఉద్యమ సమయంలో మాట్లాడిన నేతలు ఇప్పుడు మాట్లాడకపోవడం మరింత అవమానకరం. తెలంగాణలో రజాకార్లు చేసిన ఘాతుకం రక్తచరిత్రకు తార్కాణం. వారి దాష్టీకానికి ప్రజల మాన,ధన, ప్రాణాలు పోయాయి. అన్నింటికి మించి ఆడవాళ్లను నగ్నంగా బతుకమ్మలు ఆడించారు. ఇక అత్యాచార ఘటనలకు అంతేలేదు. భర్తల ముందే మహిళలపై సామూహిక అత్యాచారాలకు తెగబడ్డారు. అడ్డొచ్చిన మహిళల భర్తలను అడ్డంగా తెగనరికారు. విమోచన దినోత్సవం జరపడం అంటే దాష్టీకాలను ఎండగట్టడం మాత్రమే. ఆనాటి అరాచాకాలను గుర్తు చేసుకోవడం. ఆనాటి ఘటనల్లో మరణించిన ప్రజలకు నివాళి అర్పించడం. ఎందరో అమాయక స్త్రీలు తమ మానప్రాణాలు కోల్పోయి బలిదానం అయ్యారు. వారిని స్మరించుకుని వారికి నివాళి అర్పించడం మాత్రమే. నిజాం లొంగిపోయిన రోజు అనడం కంటే ఓ నిరంకుశుడిని పారదోలిన కారణంగా హైదరాబాద్ విమోచన దినం జరపడం అన్నది తప్పులేదు. ప్రపంచ చరిత్రలో పోరాటాలన్నీ నిరంకుశత్వం మీద దాడుల కోసం జరిగినవే. వాటిని స్వాతంత్ర్య దినాలుగానే జరుపుకుంటున్నారు. తెలంగాణ విముక్తం కూడా ఒక స్వాతంత్ర్య దినోత్సవం లాంటిదిదే. క్రూర రాచరిక తరహా పాలన నుంచి విముక్తి జరిగిన రోజుగా గుర్తించాలి. గతంలోకి వెళితే... ఆఖరి నిజాంకాలంలో, క్రూరభూస్వామ్యం పడగలెత్తి గ్రామాలను పీడించుకుని తింటున్న ప్పుడు, ప్రజలు తిరగబడ్డారు. పోరాడారు. భూములు ఆక్రమించుకుని పంచు కున్నారు, మరోవైపు నిజాం ను కీలుబొమ్మ చేసుకున్న రజాకార్లు కమ్యూనిస్టులపైన, కొన్ని చోట్ల కాంగ్రెస్ వారిపై, ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కడ ఉంటే అక్కడ దౌర్జన్యాలు చేశారు. భూస్వాముల గడీల్లో ఆశ్రయం పొందుతూ వారి తరఫున దాడులు చేశారు. పెద్ద ఎత్తున రక్తపాతం జరిగింది. బైరాన్‌పల్లి, పరకాల ఇలా ఎన్నోచోట్ల అరాచకాలకు అడ్డూ అదుపులేకుండ ఆపోయింది. కేవలం జలియన్‌వాలా బాగ్ గురించి మాత్రమే చెప్పుకుంటాం. పరకాలలో నరమేథం సాగింది. బైరాన్‌పల్లిలో ఆడవాళ్లను నగ్నంగా బతుకమ్మ లను ఆడించారు. పొలాలపై దాడులు చేశారు. ధాన్యాన్ని తరలించారు. క్రూరంగా హింసించారు. బహుశా భారతదేశ చరిత్రలో ఇంతటి దారుణాలు జరిగినా స్వాతంత్ర్య పోరాటం కారణంగా ఇవన్నీ మరుగున పడిపోయాయి. మరోవైపు నిజాం, భారత, పాకిస్థాన్ దేశాలు రెంటితోనూ తాను కలవబోనని, స్వతంత్రంగా ఉంటానని ప్రకటించాడు. ఓ దశలో పాక్‌లో కలవడానికి కూడా సిద్దం అని ప్రకటించాడు. భారత ప్రభుత్వంతో ఆ విషయమై చర్చలు, వాదాలు సాగుతూ ఉండగానే, మరో వైపు కమ్యూనిస్టుల పోరాటం సాగుతూ ఉన్న దశలోనే, భారత ప్రభుత్వం సైనికచర్య జరిపింది. నిజాం లొంగిపోయాడు. నిజాం లొంగడానికి అంతా సాజావుగా సాగలేదు. ఆనాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్య తీసుకుని ఉండకపోతే హైదారాబాద్ సంస్థనం చరిత్ర మరోలా ఉండేది. అన్ని సంస్థానాలను విలీనం చేసిన సందర్భంగా ఎలాంటి పేచీ రాకున్నా కాశ్మీర్ విషయంలో మొన్నటి దాకా పంచాయితీ తేలలేదు. 370 రద్దుతో మొన్నటికి మొన్న అది సంపూర్ణంగా భారత్‌లో విలీనం అయ్యింది. తెలంగాణ విషయంలో కూడా నెహ్రూ జోక్యం ఉండివుంటే కాశ్మీర్ లాంటి పరిస్థితి మనకు ఉండేది. అయితే తెలంగాణలో రజాకార్ల పాలనలో జరుగుతన్న అరాచాకాలను అందరూ ఎదరించి ప్రాణాలు కోల్పోయారు. నిరంకుశ రాచరిక తరహా పాలన స్థానంలో ప్రజాప్రాతినిధ్య పాలన కోసం జరిగిన పోరాటం అంతా ఇంతాకాదు. తెలంగాణ అంతర్భాగంగా ఉన్న హైదరాబాద్ రాజ్యంలో జరిగింది జాతీయోద్యమం కాకున్నా అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రజలు సాయుధ పోరాటం చేయాల్సి వచ్చింది. గాంధీతో సహా కాంగ్రెస్ వారు ఆనాడు ఇక్కడి ప్రజల గురించి పట్టించు కోలేదు. ఇక కమ్యూనిస్టులు చేసింది భూస్వామ్యా నికి వ్యతిరేకంగా భూమికోసం విముక్తి పోరాటం మాత్రమే. అయితే రజాకార్ల దాష్టీకానికి ప్రజలు సమాయత్తం అయినప్పుడు అంతా కలసి కదిలారు.లాంటి వీరులు చేసిన త్యాగం తక్కువేం కాదు. 1948 సెప్టెంబర్ 13-17 మధ్య జరిగింది భారత ప్రభుత్వం హైదరాబాద్ రాజ్యంపై జరిపిన పోలీసు చర్య కారణంగా హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం అయ్యింది. ఈ చర్యను కాంగ్రెస్ పార్టీ ఆహ్వానించడం తో పాటు, ప్రజలు కూడా సంతోషించి సంబరాలు చేసుకున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాదికి జరిగిన విముక్తి పోరాటం కావడంతో ప్రజల్లో సహజంగానే ఆనందం వెల్లి విరిసింది. బానిస సంకెళు తెగినందుకు ఆనందించారు.

# భాష్యం నివాస్ హిందీ దివాస్ !!!




విభారే న్యూస్ సెప్టెంబర్ 13 ఎమ్మిగనూరు..భాష్యం పాఠశాలలో హిందీ దివాస్ ఘనంగా జరుపుకున్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ , రాయలసీమ (5) జెడ్ఈఓ మాచాని కవిత ఆదేశాల మేరకు హిందీ భాష దినోత్సవం జరుపుకోవడం జరిగింది. దేశ అధికార భాషగా హిందీని స్వీకరించినందుకు గుర్తుగా ప్రతి సంవత్సరం హిందీ దివస్ లేదా జాతీయ హిందీ దినోత్సవం జరుపుకుంటామని భాష్యం జెడ్ఈఓ మాచాని కవిత అన్నారు.దేవ నాగరిలిపిలో ఉన్న హిందీ భాషను సెప్టెంబర్ 14 1949 భారతదేశ అధికారిక భాషగా స్వీకరించారని మొదటి హిందీ దివస్ సెప్టెంబర్ 14 .1953 నా నిర్వహించారని తెలిపారు. భారత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజపేయి 1977లో ఐక్యరాజ్యసమితిలో హిందీలో ప్రసంగించడం గమనార్హం అన్నారు. బాషా పట్ల తన మద్దతును ఆయన తెలియజేశారన్నారు ఈరోజు యువతరాన్ని హిందీలో మాట్లాడేలా ప్రోత్సహిస్తున్నారు పాఠశాలలు విశ్వవిద్యాలయాలు ఇతర విద్యాసంస్థలు హిందీ దివస్ పురస్కరించుకొని బహుళ కార్యక్రమాలను నిర్వహిస్తాయన్నారు. ముఖ్యంగా హిందీ భాషకు భాష్యం నివాసిగా భాష్యం విద్యాసంస్థలు వెలుగొందుతున్నాయన్నారు 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో 43.6% మంది ప్రజలు హిందీ మాట్లాడతారని గుర్తించారు. అదేవిధంగా భాష్యం ప్రిన్సిపల్ నాగరాజ్ సార్ విద్యార్థిని ఉద్దేశించి హిందీ భాష ప్రాముఖ్యతను గురించి కొనియాడారు. భాష్యం పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు ఉరుకుంద మాట్లాడుతూ భారతదేశానికి హిందీ భాష కిరీటం లాంటిది అంటూ కొనియాడారు ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ పద్యాలు గేయాలు ఆలపించారు హిందీ కవులు కబీర్దాస్ రహీం మీరాబాయి సుభద్ర కుమారి చౌహన్ వంటే వివిధ రకాల వేషధారణలో విద్యార్థులు పలువురిని అలరించారు హిందీ ఉపాధ్యాయులు సమీా ఉల్లా, ఉరుకుంద, శశికళలను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

# రైతులను ఖైదీలుగా మార్చిన కాంగ్రెస్ పాలన.. పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టి యూరియా టోకెన్ల పంపిణీ



కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం అన్నదాతలు అరిగోస పడుతున్నారు. సరిపడా యూరియా సరఫరా చేయడం చేతగాక.. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇవాళ ఉదయం సొసైటీకి వచ్చిన రైతులకు యూరియా సరఫరా చేయలేక.. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలో ఈ దారుణం జరిగింది.యూరియా కోసం బీబీపేట మండల కేంద్రంలోని సొసైటీ వద్దకు శనివారం భారీగా రైతులు తరలివచ్చారు. అయితే బీబీపేట మండలంలో చాలామంది రైతులకు యూరియా అవసరం ఉండగా.. కేవలం 600 బస్తాలు మాత్రమే కేంద్రానికి వచ్చాయి. కానీ అన్నదాతలు మాత్రం భారీగా క్యూకట్టారు. దీంతో ఎవరికీ యూరియా పంపిణీ చేయాలో అర్థంగాక సొసైటీ సిబ్బంది చేతులెత్తేశారు. వారందరికీ సరిపడా యూరియా లేకపోవడంతో వారిని కట్టడి చేయడం కష్టమవుతుందని వ్యవసాయ అధికారులు పోలీసులను రంగంలోకి దింపారు. ఈ క్రమంలో రైతులు, పోలీసులకు మధ్య వాగ్వాదం నెలకొంది.సొసైటీ వద్దకు వచ్చిన పోలీసులు రైతులను వెంటనే బీబీపేట పోలీస్ స్టేషన్ ప్రాంగణానికి తరలించారు. స్టేషన్ ముందు వారందరినీ నేరస్థుల్లా కూర్చొబెట్టారు. గంటల తరబడి వారిని స్టేషన్ ముందే కూర్చోబెట్టి టోకెన్లు పంపిణీ చేశారు. ఈ క్రమంలో టోకెన్ల కోసం గంటల కొద్దీ ఎండలోనే ఎదురుచూస్తూ ఉండటంతో రాజు అనే రైతు ఫిట్స్ వచ్చి పడిపోయాడు. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తాం

## మంత్రులు పొన్నం, తుమ్మల

హైదరాబాద్ సెప్టెంబర్ 13, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్ గూడా డివిజన్ లోని సర్కిల్ 19 లో 5.55 కోట్ల రూపాయలు వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రులు పొన్నం ప్రభాకర్ ,తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. యూసుఫ్ గూడా డివిజన్ లోని నవోదయ కాలని లో 7 పనులకు 178.35 లక్షల రూపాయల వ్యయంతో (నవోదయ కాలని ,మారుతి నగర్, కమలాపురి కాలని ,ఇంజనీర్స్ కాలని ) సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసుకున్న సీసీ రోడ్ల పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.తరువాత యూసుఫ్ గూడా డివిజన్ లోని లేబర్ అడ్డా రోడ్డు లో 14 పనులకు 377.35 లక్షల రూపాయల వ్యయంతో ( ఒజె నగర్, యూసుఫ్ గూడా బస్తీ , శ్రీ కృష్ణ నగర్ , హైలం కాలని ) సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు లేబర్ అడ్డా లో కూలీలలో జీహెచ్ ఎంసీ శానిటేషన్ సిబ్బందితో ముచ్చటించారు.. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ప్రజా పాలన ప్రభుత్వంలో వారి సమస్యలు పరిష్కారం చేస్తున్నామని నూతన రేషన్ కార్డులు ఇచ్చామని,సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వారికి తెలిపారు.. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సాట్ చైర్మన్ శివసేన రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్, సిఎన్ రెడ్డి, అజారుద్దీన్ , నవీన్ యాదవ్ ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ యూసుఫ్ గూడా డివిజన్ లో 5.55 కోట్ల రూపాయల తో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అనివార్య కారణాల వల్ల ఉప ఎన్నిక వచ్చింది.. ఇది ఉప ఎన్నికల కోసం కాదు. కృష్ణ నగర్ లో చాలా కాలంగా పెండింగ్ లో డ్రైనేజీ పనులు మొన్న శంకుస్థాపన చేసుకున్నాం ఇక నుండి వర్షం కురిసినపుడు ఇక్కడ ఇబ్బందులు ఉండవు. ఇటీవల కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో గెలిచాం.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో యూసుఫ్ గూడా డివిజన్ లో ఈరోజు 5.55 కోట్ల రూపాయలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నాం. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరం గా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కేబినెట్ పనిచేస్తుంది.. మీరు మరింత మద్దతు ఇవ్వండి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు దాదాపు 90 కోట్ల కు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం.. జూబ్లీహిల్స్ ఒకటే కాదు హైదరాబాద్ మొత్తం సమస్యలు పరిష్కారం చేస్తున్నాం . మీకు ఏ పనులు కావాలన్నా అడగండి.. సంక్షన్ అయిన పనులు వేగంగా పూర్తి చేయాలి.డ్రైనేజీ,రోడ్లు ఇతర పనులు పది కాలాల పాటు మన్నిక ఉండేలా పనులు పూర్తి చేయాలి. మీ సమస్యలు స్థానిక నాయకుల దృష్టికి తీసుకురండి.. మీ సమస్యల పరిష్కారం చేసే బాధ్యత మాదని అన్నారు.

# పెన్షనర్ల సంక్షేమానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే సంజయ్ కుమార్



జగిత్యాల : పెన్షనర్ల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్ అన్నారు. నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన జగిత్యాల జిల్లా తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ సంఘ కార్యవర్గం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెన్షనర్లు సమాజ మార్గదర్శకులని, వారి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళతానన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్న హరి అశోక్ కుమార్, హన్మంత్ రెడ్డి, బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, ఎండి యాకూబ్, తదితరులను అభినందించారు.ఈ కార్యక్రమంలో పెన్షనర్ల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, జిల్లా కార్యదర్శి పిసి హన్మంత్ రెడ్డి, సహాయ అధ్యక్షుడు బొల్లం విజయ్, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షులు వెల్మల ప్రకాష్ రావు, ఎండి యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సయ్యద్ యూసుఫ్, సంయుక్త కార్యదర్శులు దిండిగాల విఠల్, కట్ట గంగాధర్, ఎండి ఇక్బాల్, జాఫర్, యాకూబ్ హుస్సేన్, మల్యాల అధ్యక్షుడు ఎండి యాకూబ్, కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం, మెట్ పల్లి అధ్యక్షుడు వి ప్రభాకర్ రావు, రాయికల్ అధ్యక్షుడు వై.వేణుగోపాల్ రావు, ధర్మపురి అధ్యక్షుడు కండ్లే గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యానారాయణ

తిమ్మాపూర్ : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీ గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం నాయకుడు



మాచర్ల అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గంగాభవాని జలశుద్ధి కేంద్రాన్ని ను మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు.నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను నిర్వాహకుడు మాచర్ల సాయికిరణ్ గౌడ్ను అభినందించారు. గ్రామస్థులకు క్వాలిటీ వాటర్ అందించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, బండారి రమేష్, మోరపల్లి రమణారెడ్డి, గుజ్జుల రవీందర్ రెడ్డి, మీసాల అంజయ్య, దావు సంపత్ రెడ్డి, కొమ్మర మల్లారెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానుల సంప్రదాయం ఇది కాదు.. మోదీ మణిపూర్ పర్యటనపై ప్రియాంక గాంధీ విమర్శలు

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈశాన్య రాష్ట్రం మణిపూర్ లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. 2023లో ఈశాన్య రాష్ట్రంలో హింసాత్మక ఘర్షణల తర్వాత మోదీ ఇక్కడ పర్యటించడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో మోదీ పర్యటనపై విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మణిపూర్ పర్యటనపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తీవ్ర విమర్శలు చేశారు. ఘర్షణలు చోటు చేసుకున్న రెండేండ్ల తర్వాత రాష్ట్రంలో మోదీ పర్యటించడం దురదృష్టకరమన్నారు.వయనాడ్ పర్యటనలో ఉన్న ప్రియాంక గాంధీ అక్కడ విలేకరులతో మాట్లాడారు. 'ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో ఘర్షణలు జరిగిన రెండేండ్ల తర్వాత ప్రధాని మోదీ అక్కడ పర్యటించడం దురదృష్టకరం. ఆయన ఇప్పటికే అక్కడ పర్యటించి ఉండాల్సింది. భారత్‌లోని ప్రధానమంత్రుల సంప్రదాయం ఇది కాదు. ఏ పార్టీకి చెందిన వారైనా సరే.. ప్రమాదాలు, విషాదాలు జరిగినప్పుడు ప్రధానులు వెంటనే అక్కడికి వెళ్తారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అందరు ప్రధానులు ఇదే విధానాన్ని పాటించారు. కానీ, మోదీ మాత్రం రెండేండ్ల తర్వాత ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నారు' అంటూ తీవ్ర విమర్శలు చేశారు.




# ఓటమి భయంతో ప్రలోభాలకు దిగిన మల్లు భట్టి విక్రమార్క : లింగాల కమల్ రాజ్

మధిర, సెప్టెంబర్ 13 : ఓటమి భయంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రలోభాలకు దిగాడని, మధిర బీఆర్ఎస్ కంచుకోట అని, దాన్ని కదిలించడం భట్టికి సాధ్యం కాదని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ అన్నారు. శనివారం చింతకాని మండలంలోని పార్టీ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భట్టి విక్రమార్కపై తీవ్ర విమర్శలు చేశారు. భట్టి అధికార మదంతో, ఓటమి భయంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కమిషన్ల రూపంలో వచ్చే డబ్బుతో ప్రలోభాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మధిర నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను కదిలించడం భట్టి విక్రమార్క తరం కాదని స్పష్టం చేశారు. అంతేకాకుండా కొంతమంది పోలీసులు, అధికారులు బీఆర్ఎస్ నాయకులకు ఫోన్ చేసి కాంగ్రెస్‌లో చేరాలని భయపెడుతున్నట్లు తెలిపారు.దీనికి సంబంధించిన ఆధారాలు తన దగ్గర ఉన్నట్లు చెప్పారు. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎప్పుడూ ఇలాంటివి జరగలేదన్నారు. ఇది భట్టి చేయిస్తున్న చిల్లర రాజకీయం అని దుయ్యబట్టారు. సోషల్ మీడియా కార్యకర్తలను బెదిరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఇప్పుడు చేసిన తప్పులకు మిత్తితో సహా చెల్లిస్తాం అని తీవ్రంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో చింతకాని మండల నాయకులు మంకెన రమేష్, బొడ్డు వెంకట రామారావు, గురజాల హనుమంతరావు, వంకాయలపాటి సత్యనారాయణ, పిన్నెల్లి శ్రీనివాసరావు, కన్నెబోయిన కుటుంబరావు, పోనుగోటి రత్నాకర్, వేముల నరసయ్య, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేంద్ర కేబినెట్ విస్తరణ ఊహాగానాలు

విజయవాడ, సెప్టెంబర్ 13, ఉపరాష్ట్రపతి ఎన్నికలు పూర్తయ్యాయి. తదుపరి బీహార్ తో పాటు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి పెట్టనుంది బిజెపి. బీహార్ లో నితీష్ కుమార్ నేతృత్వంలో ఎన్డీఏ, తమిళనాడులో అన్న డీఎంకేతో పొత్తు ద్వారా అధికారంలోకి రావాలని బిజెపి భావిస్తోంది. అయితే ఇప్పుడు మిత్రుల ద్వారా ముందుకెళ్లాలని చూస్తున్న బిజెపి.. కేంద్ర మంత్రివర్గాన్ని విస్తరించి మిత్రులకు పదవులు కేటాయించాలని చూస్తోంది. బీహార్లో జెడియుకు మంత్రివర్గంలో స్థానం ఇవ్వనుంది. తమిళనాడు నుంచి బిజెపి మాజీ చీఫ్ అన్నామలైకు మంత్రి పదవి ఇచ్చేందుకు సుముఖంగా ఉంది. ఇంకోవైపు ఏపీ నుంచి ఒకరిని కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకోవాలని చూస్తోంది. అదే జరిగితే మూడు పార్టీల్లో ఎవరికి అవకాశం దక్కుతుంది అన్నది ప్రశ్నగా మిగులుతోంది.ఏపీ నుంచి ప్రస్తుతం ముగ్గురు మంత్రులు ఉన్నారు. బిజెపి నుంచి నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, తెలుగుదేశం పార్టీ నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. అయితే కేంద్ర మంత్రివర్గం తూర్పు సమయంలోనే జనసేనకు అవకాశం ఇచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. అప్పట్లో కేంద్ర మంత్రివర్గంలో చేరేందుకు పవన్ కళ్యాణ్ పెద్దగా సుముఖత వ్యక్తం చేయలేనట్టు తెలుస్తోంది. అయితే ఇప్పుడు మంత్రివర్గ విస్తరణలో ఛాన్స్ ఇస్తే దక్కించుకోవాలని పవన్ భావిస్తున్నట్లు సమాచారం. ఆ పార్టీకి రెండుచోట్ల ఎంపీలు ఉన్నారు. మచిలీపట్నం నుంచి జనసేన తరఫున గెలిచిన బాలసౌరి సీనియర్. జనసేనకు గాని ఆ పదవి కేటాయిస్తే బాల సౌరికి అవకాశం దొరికి పరిస్థితి ఉంటుంది. లేకుంటే మాత్రం నాగబాబును కేంద్ర రాజకీయాల్లోకి పంపించాలని పవన్ భావిస్తే ఆయన మంత్రి పదవి చేపట్టే అవకాశం ఉందితెలుగుదేశం పార్టీకి సంబంధించి ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉన్నారు. కింజరాపు రామ్మోహన్ నాయుడుకేంద్రంలో కీలకమైన పౌర విమానయాన శాఖను దక్కించుకున్నారు. గుంటూరు ఎంపీ చంద్రశేఖర్ మాత్రం సహాయ మంత్రి పదవితో ఉన్నారు. తెలుగుదేశం పార్టీకి కేటాయిస్తే మాత్రం రాయలసీమ ప్రాంతానికి చెందిన ఎంపీకి అవకాశం ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. ఈ లెక్కన హిందూపురం, చిత్తూరు ఎంపీల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఒకవేళ రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వదలుచుకుంటే నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చంద్రబాబు అవకాశం ఇస్తారని తెలుస్తోంది.బిజెపికి సంబంధించి ఇప్పటికే నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస వర్మ కేంద్ర సహాయ మంత్రిగా ఉన్నారు. మరోసారి బిజెపికి అవకాశం ఇవ్వాలనుకుంటే ప్రముఖంగా

## ఏపీ నుంచి ఇద్దరికి ఛాన్స్

పురందేశ్వరి పేరు వినిపిస్తోంది. మొన్నటి వరకు ఆమె ఏపీ బీజేపీ చీఫ్ గా ఉండేవారు. కేంద్రమంత్రి పదవి కారణంగానే ఆమెను తప్పించారని అప్పట్లో ప్రచారం నడిచింది. ఒకవేళ సామాజిక సమీకరణల దృష్ట్యా పురందేశ్వరికి అవకాశం రాకుంటే మాత్రం.. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కు ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. అయితే ఏ పార్టీకి ఇస్తారో తెలియదు కానీ ఏపీ నుంచి మరో కేంద్రమంత్రి పదవి ఖాయమని టాక్ నడుస్తోంది. ఉపరాష్ట్రపతిఎన్నికలు పూర్తయ్యాయి. తదుపరి బీహార్ తో పాటు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి పెట్టనుంది బిజెపి. బీహార్ లో నితీష్ కుమార్ నేతృత్వంలో ఎన్డీఏ, తమిళనాడులో అన్న డీఎంకేతో పొత్తు ద్వారా అధికారంలోకి రావాలని బిజెపి భావిస్తోంది. అయితే ఇప్పుడు మిత్రుల ద్వారా ముందుకెళ్లాలని చూస్తున్న బిజెపి.. కేంద్ర మంత్రివర్గాన్ని విస్తరించి మిత్రులకు పదవులు కేటాయించాలని చూస్తోంది. బీహార్లో జెడియుకు మంత్రివర్గంలో స్థానం ఇవ్వనుంది. తమిళనాడు నుంచి బిజెపి మాజీ చీఫ్ అన్నామలైకు మంత్రి పదవి ఇచ్చేందుకు సుముఖంగా ఉంది. ఇంకోవైపు ఏపీ నుంచి ఒకరిని కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకోవాలని చూస్తోంది. అదే జరిగితే మూడు పార్టీల్లో ఎవరికి అవకాశం దక్కుతుంది అన్నది ప్రశ్నగా మిగులుతోంది.ఏపీ నుంచి ప్రస్తుతం ముగ్గురు మంత్రులు ఉన్నారు. బిజెపి నుంచి నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, తెలుగుదేశం పార్టీ నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. అయితే కేంద్ర మంత్రివర్గం తూర్పు సమయంలోనే జనసేనకు అవకాశం ఇచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. అప్పట్లో కేంద్ర మంత్రివర్గంలో చేరేందుకు పవన్ కళ్యాణ్ పెద్దగా సుముఖత వ్యక్తం చేయలేనట్టు తెలుస్తోంది. అయితే ఇప్పుడు మంత్రివర్గ విస్తరణలో ఛాన్స్ ఇస్తే దక్కించుకోవాలని పవన్ భావిస్తున్నట్లు సమాచారం. ఆ పార్టీకి రెండుచోట్ల ఎంపీలు ఉన్నారు. మచిలీపట్నం నుంచి జనసేన తరఫున గెలిచిన బాలసౌరి సీనియర్. జనసేనకు గాని ఆ పదవి కేటాయిస్తే బాల సౌరికి అవకాశం దొరికి పరిస్థితి ఉంటుంది. లేకుంటే మాత్రం నాగబాబును కేంద్ర రాజకీయాల్లోకి పంపించాలని పవన్ భావిస్తే ఆయన మంత్రి పదవి చేపట్టే అవకాశం ఉంది.తెలుగుదేశం పార్టీకి సంబంధించి ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉన్నారు. కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్రంలో కీలకమైన పౌర విమానయాన శాఖను దక్కించుకున్నారు. గుంటూరు ఎంపీ చంద్రశేఖర్ మాత్రం సహాయ మంత్రి పదవితో ఉన్నారు. తెలుగుదేశం పార్టీకి కేటాయిస్తే మాత్రం రాయలసీమ ప్రాంతానికి చెందిన ఎంపీకి అవకాశం ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. ఈ లెక్కన హిందూపురం, చిత్తూరు ఎంపీల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఒకవేళ రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వదలుచుకుంటే నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చంద్రబాబు అవకాశం ఇస్తారని తెలుస్తోంది.బిజెపికి సంబంధించి ఇప్పటికే నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస వర్మ కేంద్ర సహాయ మంత్రిగా ఉన్నారు. మరోసారి బిజెపికి అవకాశం ఇవ్వాలనుకుంటే ప్రముఖంగా పురందేశ్వరి పేరు వినిపిస్తోంది. మొన్నటి వరకు ఆమె ఏపీ బీజేపీ చీఫ్ గా ఉండేవారు. కేంద్రమంత్రి పదవి కారణంగానే ఆమెను తప్పించారని అప్పట్లో ప్రచారం నడిచింది. ఒకవేళ సామాజిక సమీకరణల దృష్ట్యా పురందేశ్వరికి అవకాశం రాకుంటే మాత్రం.. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కు ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. అయితే ఏ పార్టీకి ఇస్తారో తెలియదు కానీ ఏపీ నుంచి మరో కేంద్రమంత్రి పదవి ఖాయమని టాక్ నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# వార్నింగ్ లతో సరా...



గుంటూరు, సెప్టెంబర్ 13. వైసీపీ అధినేత వైఎస్ జగన్ దూకుడు పెంచారు. జనంలోకి వెళ్లడమే కాకుండా ప్రభుత్వ నిర్ణయాలు అమలు కాకుండా వార్నింగ్ ల మీద వార్నింగ్ లు ఇస్తున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేయడాన్ని జగన్ తప్పుపడుతున్నారు. తమ హయాంలో జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడానికి అవసరమైన భవనాలను నిర్మించామని, మౌలిక వసతులు కూడా అనేక కళాశాలల్లో కల్పించామని, కొన్ని చోట్ల మెడికల్ కళాశాలలో తరగతులు కూడా ప్రారంభమయ్యాయని జగన్ చెప్పుకొచ్చారు. ఇప్పుడు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేయడానికి చంద్రబాబు నాయుడు పెద్ద స్కామ్ కు తెరలేపారని ఆరోపించారు. తన సొంత మనుషులకు మెడికల్ కళాశాలలను కట్టబెట్టడానికే ఈ నిర్ణయం తీసుకున్నారని దీని వెనక పెద్ద మొత్తంలో ముడుపులు చేతులు మారే అవకాశముందని ఆరోపించారు. అదే సమయంలో చంద్రబాబు నాయుడు కూడా అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడం అంటే కేవలం భూములను కేటాయించడమే కాదని, అందుకు అవసరమైన అన్ని రకాలుగా వసతులతో పాటు ప్యాకల్టీని, అవసరమైన సామగ్రిని సిద్ధం చేయాల్సిన గత ప్రభుత్వం మొండి గోడలను వదిలేసిందన్నారు. ఇంత భారీ సంఖ్యలో మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసి, వాటిని నిర్వహించడం ప్రభుత్వానికి భారంగా మారుతుందని కూటమి నేతలు చెబుతున్నారు. అందుకే పీపీపీ మోడల్ లో ప్రయివేటు వారికి అప్పగిస్తే తప్పేమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రతి మెడికల్ కళాశాలలో యాభై శాతం సీట్లు కన్వీనర్ కోటా కింద ఉంటాయని, పేద విద్యార్థులకు ఇది ఉపయోగమేనని వారు వాదిస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించేకంటే ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో నాణ్యమైన వైద్య విద్య అందుతుందని అంటున్నారు.అధికారంలోకి వస్తే అయితే జగన్ మాత్రం తాము తిరిగి అధికారంలోకి వస్తే తిరిగి ప్రభుత్వ పరం చేసుకుంటామని హెచ్చరించారు. ఎవరూ టెండర్లలో పాల్గొనవద్దని కూడా ఆయన పరోక్షంగా చెప్పారు. ఒకవేళ మెడికల్ కళాశాలను ఇప్పుడు తీసుకున్నా మూడేళ్ల తర్వాత తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారి నుంచి ఖచ్చితంగా తీసుకుంటామని చెబుతున్నారు. అంటే ఒకరకంగా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూనే అందుకు ముందుకు వచ్చే వ్యక్తులపై కూడా బెదిరింపులకు దిగుతున్నట్లు కనిపిస్తుందని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని, బెదిరిస్తే ఎవరూ భయపడే వారు లేరని అంటున్నారు. ఇదే సమయంలో ఖచ్చితంగా పబ్లిక్, ప్రయివేట్ పార్ట్ నర్ షిప్ పద్ధతిలో వైద్య కళాశాలలను నిర్వహిస్తామని కూటమి సర్కార్ చెబుతుంది. మొత్తం మీద ఏపీలో మెడికల్ వార్ మొదలయిందనే అనుకోవాలి. జగన్ కూడా స్వయంగా ఆందోళనల్లోకి దిగుతామని హెచ్చరించి ఈ అంశానికి మరింతగా పొలిటికల్ హీట్ పెంచినట్లయింది.

# కొత్త జిల్లాలపై ఫైనల్ కసరత్తు

కాకినాడ, సెప్టెంబర్ 13, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు, ఉన్న జిల్లాల సరిహద్దుల మార్పు, మండలాలు, గ్రామాల సర్దుబాట్లు, పేర్ల మార్పు వంటి అంశాలపై అధ్యయనం చేయడానికి ఏడుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ సబ్ కమిటీ కసరత్తు చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం చేసిన జిల్లా విభజనలో ఏర్పడిన గందరగోళాన్ని సరిచేయడం, ప్రజల సౌకర్యాన్ని పెంచడం ప్రధాన లక్ష్యాలుగా మార్పు, చేర్పులపై ఆలోచనలు చేస్తున్నారు. ప్రజా అభిప్రాయాలను సేకరించి, శాస్త్రీయంగా పునర్వ్యవస్థీకరణ చేయాలని కమిటీ పనిచేస్తోంది.కానీ మొత్తం ఏడుగురు మంత్రులతో ఏర్పాటు చేశారు. కలెక్టర్లు, ప్రజల నుంచి సూచనలు సేకరించడంలో కమిటీ పాల్గొంటుంది. గత ప్రభుత్వం జిల్లాలు ఏర్పాటు చేసినప్పుడు ప్రజాభిప్రాయాలను పట్టించుకో?కండా ..అసమంజసమైన సరిహద్దులతో జిల్లాలను ఏర్పాటు చేశారన్న అభిప్రాయం ఉంది. రంపచోడవరం నుంచి జిల్లా కేంద్రానికి 187 కి.మీ. దూరం ఉంది. దీని వల్ల గందరగోళం ఏర్పడింది. ఇప్పుడు ఇవి సరిచేయడానికి కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే సరిహద్దులు , పేర్ల మార్పుపైనా కసరత్తులు చేస్తున్నారు. జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు మార్చడం, పేర్లు మార్చడం. ప్రజల నుంచి వచ్చిన డిమాండ్ల ఆధారంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నారు. ఇతర జిల్లాల్లో సరిహద్దులు మార్చే ప్రతిపాదనలు ఉన్నాయి. అద్దంకి (బాపట్ల జిల్లా), కందుకూరు (నెల్లూరు జిల్లా) ఒంగోలు, కొండపి, సంతనుతలపాడు (మొత్తం 5 నియోజకవర్గాలు)తో ప్రకాశం జిల్లా, కృష్ణ జిల్లా నుంచి గన్నవరం, పెనమలూరు ఔఖీ జిల్లాలో కలపడం (విజయవాడ ఈస్ట్, వెస్ట్, సెంట్రల్, తిరువురు, మ్యలవరం ? మొత్తం 7). విజయనగరం జిల్లా నుంచి ఎస్.కోటా విశాఖపట్నంలో చేర్చడం, తూర్పు గోదావరి జిల్లాలో మండపేట చేర్చడం, కాకినాడ జిల్లాలో రామచంద్రాపురం చేర్చడం. తిరుపతి జిల్లాలో రైల్వే కోడూరు చేర్చడం వంటి ప్రతిపాదనలపై చర్చించే అవకాశం ఉంది. కలెక్టర్ల ద్వారా సూచనలు సేకరణ, ప్రజా అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటారు. మార్కాపురం కొత్త జిల్లాను గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాలు చేర్చి ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. గుంటూరు జిల్లా నుంచి మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లోని 29 గ్రామాలు, పెదకూరపాడు, నందిగామ, జగ్గయ్యపేట వంటి 5 నియోజకవర్గాలతో అమరావతి జిల్లా ఏర్పాటు, రంపచోడవరం డివిజన్, చింతూరు డివిజన్ నుంచి 4 మండలాలు కలిపి రంపచోడవరం జిల్లాలను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలపై చర్చలు జరుగుతున్నాయి. కొన్ని జిల్లాల సరిహద్దులు మార్చే ప్రక్రియ ఉది. కమిటీ ఈ నెలలోనే సమావేశాలు నిర్వహిస్తూ, అసెంబ్లీ సమావేశాలకు ముందు నివేదిక సమర్పించనుంది. మొత్తం ప్రక్రియ 2025 డిసెంబర్ 31కి పూర్తి చేయాల్సి ఉటుది. 2026 జనవరి 1 నుంచి 2027 మార్చి 31 వరకు సెన్సస్ కారణంగా జిల్లా మార్పులు చేయలేరని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# రాజారెడ్డి.. వర్సెస్ జగన్

కడప, సెప్టెంబర్ 13,రాజకీయ పార్టీల్లో లెగసీ కంటిన్యూ చేయడానికి అన్నా చెల్లెళ్లు పోటీ పడుతున్నారు. ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి రాజకీయ వారసత్వంపై కుటుంబాల్లోనే విభేదాలు తలెత్తాయి. అయితే తండ్రి నుంచి సంక్రమించిన రాజకీయాలకు వారసుడెవరు? అనేది నిర్ణయించేది నేతలు కాదు.. ఆ కుటుంబం కాదన్నది మర్చిపోతున్నారు. వారసుడు తామేనంటూ ప్రకటనలు చేస్తున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ లోనూ కల్వకుంట్ల కవిత, కేటీఆర్ ల మధ్య విభేదాలు తలెత్తాయి. కేవలం రాజకీయ ఆధిపత్యం కోసమే ఈ కీచులాటలని చెప్పకతప్పదు. ఆంధ్రప్రదేశ్ లోనూ ఎప్పటి నుంచో వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసత్వంపై యుద్ధమే జరుగుతుంది. వైఎస్ షర్మిల, వైఎస్ జగన్ ల మధ్య వార్ నడుస్తుంది. తాజాగా వైఎస్ రాజారెడ్డి వైఎస్ వారసుడంటూ షర్మిల చేసిన వ్యాఖ్యలతో మరోసారి రాజకీయ వారసత్వంపై రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చ జరుగుతుంది. సాధారణంగా తండ్రి మరణించిన వెంటనే రాజకీయ వారసత్వం కోసం కొందరు పోటీ పడతారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ కూడా ఇందిరా గాంధీ మృతి తర్వాత రాజీవ్ గాంధీ, రాజీవ్ గాంధీ మరణం తర్వాత రాహుల్ గాంధీ వారసులుగా నిలిచారు. మేనకా గాంధీ వారసత్వంపై విభేదించారు. మేనకాగాంధీ తన వారసుడిగా వరుణ్ గాంధీని రంగంలోకి దించారు. అయితే చివరకు రాజకీయ వారసత్వం సోనియాగాంధీ ఇంటికి చేరుకుంది. మేనకా గాంధీ బీజేలో చేరిపోయారు. ఇక ప్రియాంక ఉన్నప్పటికీ ఆమె వారసత్వం జోలికి పోలేదు. అన్న రాహుల్ గాంధీ మాత్రమే వారసత్వం చేపట్టాలని చెబుతుంది. తమిళనాడులో కరుణానిధి మరణం తర్వాత స్టాలిన్, ఆళగిరి మధ్య వారసత్వ పోరు ప్రారంభమయినా పార్టీతో పాటు అధికారం కూడా స్టాలిన్ చేతుల్లోకి వచ్చింది. ఆళగిరి కనిపించడం లేదు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణించిన తర్వాత వైఎస్ జగన్ సొంత పార్టీ పెట్టుకున్నారు. ఆయనను జనం ఆదించారు. 2019 ఎన్నికల్లో అధికారాన్ని కట్టబెట్టారు. అయితే ఇప్పుడు వైఎస్ వారసుడు వైఎస్ రాజారెడ్డి అంటూ తన కుమారుడిని రంగంలోకి దించారు. అయితే రాజారెడ్డి ఇంటిపేరు వైఎస్ కాదంటూ వైసీపీ సోషల్ మీడియాలో పెద్దయెత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. తన భర్త ఇంటి పేరు కుమారుడికే వస్తున్నా వైఎస్ ట్యాగ్ లైన్ వదలడానికి షర్మిల ఇష్టపడటం లేదు. తన కుమారుడికి రాజారెడ్డి అని వైఎస్ నామకరణం చేశారంటూ గుర్తు చేస్తున్నారు. అయితే రాజారెడ్డిని గుర్తించాల్సింది వైఎస్ కుటుంబ సభ్యులు కాదు.. షర్మిల అభిమానులు కాదు.. వైసీపీ వీరాభిమానులు కూడా కాదు. రాజారెడ్డి రాజకీయ ప్రవేశం చేసి వస్తే ఆయనను నేతగా గుర్తించాల్సింది ప్రజలు మాత్రమేనన్న విషయం మరిచిపోయి వ్యవహరిస్తున్నారన్న కామెంట్స్ బహిరంగంగానే వినిపిస్తున్నాయి. వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికున్నంత కాలం కాంగ్రెస్ లోనే ఉన్నారు. పదవి ఉన్నా లేకున్నా ఆయన పార్టీని వీడలేదు. చివరకు రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. కానీ వైఎస్ జగన్ సొంత పార్టీ పెట్టుకున్న తర్వాత కాంగ్రెస్ ఓటు బ్యాంకు మొత్తం వైసీపీకి షిఫ్ట్ అయింది. అంటే వైఎస్ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఎక్కువ మంది వైఎస్ వారసుడిగా నాడు జగన్ ను గుర్తించారు. ఇప్పుడు కూడా రాజారెడ్డి రాజకీయాల్లోకి వచ్చినప్పటికీ వారసుడిగా షర్మిల ప్రకటించుకుంటే చాలదు. రేపు రాజారెడ్డి జనంలోకి వచ్చినప్పుడు ఆయనకు కనిపించే ఆదరణ, ఆయన సాధించే గెలుపులు వంటివి మాత్రమే వైఎస్ వారసుడు ఎవరన్నది తేల్చనున్నాయి. రాజారెడ్డి ఇంకా రాజకీయాల్లోకి రాకముందే ఆయన చుట్టూ వారసత్వంపై చర్చ జరుగుతుండటం విచిత్రమనే అనుకోవాలి. వైఎస్ షర్మిల కూడా తాను గత ఐదేళ్ల నుంచి సాధించింది రాజకీయాల్లో ఏమీ లేదని, రాజారెడ్డిని కూడా ఈ మురికి కూపంలోకి ఎందుకు తెస్తున్నారంటూ సోషల్ మీడియాలో వైఎస్ అభిమానులు కామెంట్ చేస్తున్నారు.

# బెజవాడలో డయేరియా...

విజయవాడ, సెప్టెంబర్ 13.విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరి పేటలో డయేరియా బాధితులు కోలుకుంటున్నారు. ఇప్పటివరకు మొత్తం 115 కేసులు నమోదైనాయి. వీరిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారు 61 మంది. చికిత్స తీసుకొని మరో 54 మంది డిశ్చార్జ్ అయినారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అక్కడ మెడికల్ క్యాంప్ కొనసాగుతుంది. డయేరియా కారణంగా స్థానికులు కాచి చల్లార్చిన నీరే తాగాలని వైద్యాధికారులు హెచ్చరికలు జారీ చేశారు. బాధితులకు మెడికల్ టెస్ట్ లు కొనసాగుతున్నాయి.ఇక్కడి డయేరియా కేసుల పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ ఓవైపు బాధితులు కోలుకుని ఇంటికి వెళ్తుంటే మరోవైపు కొత్త కేసులు నమోదవుతున్నాయి. న్యూ రాజరాజేశ్వరి పేట వైద్య శిబిరంలో ఈ రోజు కొత్తగా మరో 5 గురు అడ్మిట్ అయ్యారు. దీంతో 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేటలో సచివాలయాల వారీగా బృందాలు ఇంటింటి సర్వే చేస్తున్నాయి. ఎంపీడీవో స్థాయి అధికారి పర్యవేక్షణలో బృందాలుగా ఏర్పడి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. జ్వర పీడితులు, వాంతులు, విరేచనాలతో ఎవరైనా బాధపడుతున్నారా? అనే సమాచారాన్ని సేకరించే పనిలో అధికార గణం పని చేస్తుంది.పాత రాజరాజేశ్వరి పేటలో పెరుగుతున్న డయేరియా కేసులు.. ఇప్పటివరకు 100 దాటిన డయేరియా బాధితుల సంఖ్య. నిన్న రాత్రి మెడికల్ క్యాంప్‌లో 30 మంది చికిత్స కోసం వచ్చారు. మరికొందరు బాధితులు వైద్యానికి ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తున్నారు. ఇప్పటికే పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా నిలిపివేసిన అధికారిక యంత్రాంగం.విజయవాడలోని న్యూరాజరాజేశ్వరిపేటలో ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రభుత్వ పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. మంచినీటి పైపులైన్, అండర్ గ్రౌండ్ నీటి నమూనాలను పరీక్షకు పంపించామన్నారు. మరోవైపు ల్యాబ్ రిపోర్ట్ నెగెటివ్ రావడంతో మంచినీటి సరఫరా కూడా నిలిపివేశామన్నారు. ఇప్పటి వరకు డయేరియాతో ఎవరూ చనిపోలేదని, వదంతులు నమ్మొద్దని మంత్రి సత్యకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# కరెంట్ ఆఫీస్ సెంటర్ లో విద్యార్థిని రాత్రి దారుణ హత్య

నెల్లూరు,బి ఫార్మసీ ఫైనల్ ఇయర్ పూర్తయిన మైధిలి ప్రియను నిఖిల్ కత్తితో పొడిచి దారుణంగా హతమార్చాడు. మాట్లాడాలని కరెంట్ ఆఫీస్ సెంటర్ సమీపంలోని రూముకి పిలిచి, కత్తితో పొడిచి చంపిన స్నేహితుడు ఆపై పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. పోలీసులు మృతదేహాన్ని నెల్లూరు మార్చురీకి తరలించారు. నిందితున్ని కఠినంగా శిక్షించాలని మృతురాలి బంధువులు డిమాండ్ చేసారు. రెండు రోజుల క్రితం గూడూరులో ఓ యువకుడిని అత్యంత దారుణంగా కత్తులతో నరికి చంపిన ఘటన మరొక ముందే నెల్లూరు నగరంలో ఓ యువతిని నమ్మించి అత్యంత కిరాతకంగా పొడిచి చంపిన ఘటన నెల్లూరు జిల్లా ప్రజల్లో తీవ్ర భయాందోళన రేకెత్తిస్తుంది.

# నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : భాగం హేమంతరావు

బోనకల్లు, సెప్టెంబర్ 13 : అకాల వర్షాల వల్ల నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ?శనివారం మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో దెబ్బతిన్న పత్తి పంటలను సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ.. ఈ సంవత్సరం అధిక వర్షాల కారణంగా తెలంగాణలో అనేక ప్రాంతాల్లో, ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చే సమయానికి అధిక వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. సాధారణంగా ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ఇప్పుడు కేవలం ఒకటి లేదా రెండు క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదన్నారు. వర్షాల వల్ల పత్తి చెట్లు ఏపుగా పెరిగినా, కాయలు కుళ్లిపోవడంతో రైతులు అయోమయ స్థితిలో ఉన్నట్లు తెలిపారు.కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని, వారు ముందుగానే కౌలు చెల్లించి, అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారన్నారు. అకాల వర్షాలతో కౌలు రైతులు అత్యధికంగా నష్టపోయారు, చాలా మంది ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ?కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని ఎత్తివేయడం కూడా రైతులకు నష్టాన్ని కలిగిస్తోందని, తెలంగాణలో 18 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేసినట్లు వెల్లడించారు. మొత్తం రైతులు అప్పులపాలై తీవ్ర నష్టాల్లో ఉన్నారని, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని నష్టపోయిన రైతులకు, కౌలు రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ?ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జక్కుల రామారావు, సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, రైతులు పుచ్చకాయల తిరుపయ్య, గోళ్ల కన్నయ్య, చింతలచెర్వు మాదారయ్య, కౌలు రైతులు పాల్గొన్నారు.

# రేణు అగర్వాల్ హత్యకేసులో ఇద్దరు అరెస్టు

హైదరాబాద్,కూకట్ పల్లి లో రేణు అగర్వాల్ మర్డర్ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేసారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ ఈ నెల పదవ తేదీన కూకట్ పల్లి లోని స్వాన్ లేక్ అపార్ట్మెంట్ లో రేణు అగర్వాల్ అనే మహిళ హత్య కు గురైంది. హర్ష, రోషన్ ఇద్దరు లు కలిసి మర్డర్ చేశారు. ఇద్దరినీ రాంచి లో అదుపులోకి తీసుకున్నాం.నిందుతుల నుంచి ఏడు తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని అన్నారు.నిందితులు మూడు రోజులుగా ప్లాన్ చేసుకున్నారు. డబ్బులు, బంగారం కోసం మర్డర్ చేశారు. ప్రెషర్ కుక్కర్ తో కొట్టి తర్వాత కట్టేసి గొంతు కోసి చంపారు. హర్ష కు, రోషన్ కు ఇద్దరి కీ ముందు నుంచి పరిచయం ఉంది. రోషన్ స్వాన్ లేక్ అపార్ట్మెంట్ లో అగర్వాల్ ఫ్యామిలీ కీ తెలిసిన వాళ్ళ ఇంట్లో పనిచేసేవాడు. హర్ష డ్రగ్ అడిక్ట్.. గతంలో రిహబిలిటేషన్ సెంటర్ లో ట్రీట్మెంట్ తీసుకున్నాడు. బైక్ మీద బయటకు వెళ్లి హఫీజ్ పేట్ లో క్యాబ్ తీసుకొని రాంచి కీ పోయారు. క్యాబ్ డ్రైవర్ సోషల్ మీడియా లో చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడని అయన అన్నారు.

# మహానంది నిత్యాన్నదాన పథకానికి భక్తుల ఉదార విరాళాలు---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 13-మహానంది క్షేత్రంలోని నిత్యాన్నదాన పథకమునకు ఆత్మకూరు వాస్తవ్యులు తోట కేశవ వరప్రసాద్ గారు భక్తి శ్రద్ధలతో రూ.30, వేలు విరాళమును సమర్పించారు. అలాగే నిజాంపేట్, హైదరాబాద్ వాస్తవ్యులు శేషశాయి వంశి గారు రూ.5,150/- సమర్పించగా, నంద్యాల వాస్తవ్యులు మద్దిలేటి రాజు ? రమాదేవి దంపతులు రూ.5,000/- భక్తి భావంతో సమర్పించారు. ఈ విరాళములు అన్నదాన పథకానికి ఎంతో దోహదం అవుతాయని, భక్తుల సేవా మనోభావానికి దేవస్థాన అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

# నంద్యాలలో కొన్ని ఏరియాలకు నీటి సరఫరా--

## కమిషనర్ బండి శేషన్న




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 13-నంద్యాల పట్టణంలో ప్రజలు ఎదురుచూస్తున్న నీటి సమస్యకు ముగింపు పలుకుతూ, రామకృష్ణ పిజి కాలేజ్ బ్రిడ్జి దగ్గర నిన్న చేపట్టిన పైప్ లైన్ మరమ్మత్తులు శనివారం విజయవంతంగా పూర్తయ్యాయని, ప్రస్తుతం ట్యాంకులకు నీరు నింపుతున్నామని నంద్యాల పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న ఒ ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 6:30 గంటల నుంచే విశ్వ నగర్, సాదిక్ నగర్, అర్ ఎఫ్ రోడ్, నూనెపల్లె, సాయిబాబా నగర్, వీసి కాలనీ, దేవనగర్, రాయల్ కాంపౌండ్, హనీఫ్ నగర్ పార్ట్, విజయపురి కాలనీ, బర్మశాల వంటి ప్రధాన ఏరియాలకు నీటి సరఫరా అందజేయనున్నట్లు స్పష్టం చేశారు. అదే విధంగా ఎన్జీవో కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, నర్స్ క్వార్టర్స్, లలిత నగర్, ఎస్ బీ ఐ కాలనీ, జ్ఞానాపురం, మూలసాగరం ప్రాంతాలకు ఆదివారం ఉదయం నుంచే నీరు సరఫరా ప్రారంభమవుతుందని కమిషనర్ బండి శేషన్న వివరించారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరుతూ, నీటి సమస్యను పరిష్కరించడంలో మున్సిపల్ యంత్రాంగం కట్టుబడి ఉందని కమిషనర్ బండి శేషన్న హామీ ఇచ్చారు.

## నంద్యాల పశువుల సంతలో వసూళ్ల దందా--

### రైతులపై దౌర్జన్యం!--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 13-నంద్యాల పట్టణంలోని నూనెపల్లె మార్కెట్ యార్డ్ లో ప్రతి శనివారం జరిగే పశువుల సంతలో వసూళ్ల రాజ్యం అల్లకల్లోలం సృష్టిస్తోంది. నంద్యాల జిల్లా మాత్రమే కాదు, ఇతర జిల్లాల నుంచి కూడా వందలాది రైతులు పెద్దఎత్తున పశువుల క్రయ విక్రయాలకు తరలి వస్తున్నారు. అయితే రైతులకు కనీస సౌకర్యాలు కల్పించని అధికారులు, గేట్ వద్ద వంద రూపాయల దందా మొదలుపెట్టారు. రశీదు ఇవ్వాల్సిన చోట సిబ్బంది సగానికి పైగా ఎలాంటి రశీదు లేకుండా నేరుగా వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారని ఘోర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రశ్నించిన రైతులపై దురుసుగా ప్రవర్తిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న మార్కెట్ యార్డ్ సిబ్బంది తీరుతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న ఈ అక్రమ వసూళ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని, మార్కెట్ యార్డ్ చైర్మన్ తక్షణమే జోక్యం చేసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



# ప్రజా ప్రతినిధులు, జిల్లా ప్రజల సహకారంతో కర్నూలు జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా

## కర్నూలు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డా.ఏ.సిరి






విభారేన్యూస్‌కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 13:- ప్రజా ప్రతినిధులు, జిల్లా ప్రజల సహకారంతో కర్నూలు జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. సెకండరీ హెల్త్ డైరెక్టర్ గా పనిచేస్తూ కర్నూలు జిల్లా కలెక్టర్ గా నియమితులైన డా.ఏ.సిరి శనివారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో కర్నూలు జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం మత పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించి జిల్లా కలెక్టర్ కు ఆశీస్సులు అందచేశారు. .బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రధానంగా ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, అలాగే కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీ గా తీర్చిదిద్దడం, జిల్లాలో త్రాగునీటి సమస్య ల పరిష్కారం, భూగర్భ జలాల పెంపు అంశాలపై కూడా దృష్టి పెడతామన్నారు.. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ ద్వారా జిల్లాలో పారిశ్రమికాభివృద్ధి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కు కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. అలాగే విద్యా రంగం అభివృద్ధి, ముఖ్యముగా గ్రామీణ ప్రాంతంలో విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పై కూడా దృష్టి పెడతామని, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మరమ్మతు పనులు ఏమైనా ఉంటే, వాటిని చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు... పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.. రెవెన్యూ కు సంబంధించిన భూ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు మేలు జరిగేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు..తదనంతరం నూతన కలెక్టర్ కు జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు, తదితరులు పుష్పగుచ్చాలతో జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలిపారు

# నంద్యాలలో చిన్నారుల ప్రతిభ

## --మెరిసిన మాతృభూమికి కళార్చన పోటీలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 13-నంద్యాల పట్టణంలో కళారాధన ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ ? ఐఎంఏల సంయుక్త నిర్వహణలో, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సృజనాత్మక సంస్కృతి సమితి సహకారంతో కొనసాగుతున్న మాతృభూమికి కళార్చన పోటీలు 13వ రోజు విద్యార్థుల ప్రతిభ చాటుకుంది.




జూనియర్ క్విజ్ పోటీలు:డాక్టర్ రవి కృష్ణ క్విజ్ మాస్టర్‌గా నిర్వహించిన క్విజ్ పోటీల్లో 7 పాఠశాలల జట్లు పాల్గొన్నాయి. చరిత్ర, సైన్స్, సాహిత్యం తదితర అంశాలపై 8 రౌండ్లు సాగిన పోటీలో గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ మొదటి, రోటరీ ఇంగ్లీష్ మీడియం రెండవ స్థానం సాధించగా, గుడ్ షెఫర్డ్, సత్యసాయి స్కూల్ మూడవ స్థానంలో నిలిచాయి. చాణక్య, జ్యోతిర్మయి, టెక్కే పాఠశాలలు స్పెషల్ జ్యూరీ ప్రైజులు అందుకున్నాయి. కథ చెప్పుట పోటీలు:మూడవ తరగతి లోపు చిన్నారులు తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో కథలు చెప్పి అందరినీ ఆకట్టుకున్నారు. వందమంది విద్యార్థులు హావభావాలతో చెప్పిన కథలు ప్రేక్షకులను అలరించాయి. స్పాట్ వక్తృత్వం:"ఓటు ప్రాధాన్యత, జీవిత లక్ష్యం, సోషల్ మీడియా ప్రభావం" వంటి అంశాలపై విద్యార్థులు చక్కటి ఉపన్యాసాలు ఇచ్చి ప్రతిభ చూపించారు. ముగింపు ఉత్సవం ఆదివారం:ఎన్టీఆర్ పురపాలక సెంటినరీ టౌన్ హాల్లో ఆదివారం సాయంత్రం మాతృభూమికి కళార్చన 25వ వార్షికోత్సవ ముగింపు ఉత్సవం జరుగుతుంది. 4,000 మంది విద్యార్థులలో విజేతలుగా నిలిచిన 350 మందికి బహుమతులు అందజేయనున్నారు. ముగింపు కార్యక్రమంలో దేశ నాయకుల వేషధారణ, సామాజిక చైతన్యం కలిగించే వేషధారణ పోటీలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయి.

## రజకుల రక్షణ కోసం మంత్రి ఫరూక్ కు వినతిపత్రం--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 13-నంద్యాల (రాజ్ టాకీస్) టీడీపీ కార్యాలయంలో ఆల్ ఇండియా ధోబి మహాసంగ్ రాష్ట్ర అధ్యక్షులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో రజక సంఘం నాయకులు న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రజకులపై దాడులు ఆపాలని, రక్షణ చట్టం, దోబీ ఘాట్లు, 300 యూనిట్స్ ఉచిత కరెంటు, పనిముట్ల పంపిణీ, దేవాలయ కమిటీల్లో రజకులకు సభ్యత్వం కల్పించాలని వినతిపత్రంలో కోరారు. ఈ విషయంపై మంత్రి ఫరూక్ సానుకూలంగా స్పందించి, అంశాలను సంబంధిత శాఖలకు, అలాగే మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

## రాష్ట్రస్థాయి రాపిడ్ - బ్లిట్జ్ చెస్ పోటీలు---

### నంద్యాలలో ఘనంగా ప్రారంభం--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 13-:ఆంధ్ర చెస్ సంఘం ఆధ్వర్యంలో, నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో రాష్ట్రస్థాయి రాపిడ్, బ్లిట్జ్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు నంద్యాలలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జరిగిన ఈ టోర్నమెంట్‌ను రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి, జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదరంగం విద్యార్థుల్లో ఏకాగ్రతను, మానసిక వికాసాన్ని పెంచుతుందని చెప్పారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి జట్లు పాల్గొంటున్నాయని, విజేతలు జాతీయస్థాయిలో రాష్ట్ర తరపున ఆడతారని తెలిపారు. జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆదివారం జరిగే ముగింపు కార్యక్రమంలో విజేతలకు పతకాలు, ట్రోఫీలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పాన్సర్ రాజేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్, డాక్టర్ నీలా ప్రసాద్, రాష్ట్ర చెస్ సంఘం ప్రతినిధులు, పలు జిల్లాల చెస్ సంఘాల అధ్యక్షులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# నిండుకుండలా గాజులదిన్నె

కర్నూలు,సెప్టెంబరు13 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కర్నూలు జిల్లాలోని ప్రధాన జలాశయమైన గాజుల దిన్నె ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతోంది. మూడేళ్ల తర్వాత ఈ ప్రాజెక్టు నిండింది. ఇన్‌ఫ్లో పెరగడంతో మూడు గేట్లు- ఎత్తి 10,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నిండుకుండలా ఉన్న జలాశయాన్ని చూసి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# రక్తదానం చేద్దాం - ప్రాణాలను కాపాడుదాం--

## ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా సేవా యజ్ఞం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 13:"ప్రాణదానం కంటే గొప్పదానం లేదు? రక్తదానం అంటే ప్రాణదానం" అనే నినాదంతో, ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు ఘనంగా నిర్వహించనున్నామని నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి పేర్కొన్నారు. శనివారం ఒక ప్రకటనలో జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మదు వివరాలు వెల్లడిస్తూ సెప్టెంబర్ 17న జిల్లా కేంద్రంలో ప్రధాన రక్తదాన శిబిరం జరుగుతుంది. సెప్టెంబర్ 18 నుండి అక్టోబర్ 2 వరకు అన్ని మండల కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయబడతాయని తెలిపారు ."అన్ని దానాలకంటే రక్తదానం గొప్పది. రక్తదానం చేయడం ద్వారా ఒకరి ప్రాణాన్ని కాపాడినట్టే అవుతుంది. సమాజానికి, దేశానికి ఇది ఒక మహాసేవ. ప్రతి ఒక్కరూ ఈ పవిత్ర కర్తవ్యాన్ని స్వీకరించాలని మనవి చేస్తున్నాను" అని అభిరుచి మదు పిలుపునిచ్చారు. యువతకు ప్రత్యేక పిలుపు"మన దేశ భవిష్యత్తు యువతే. యువత ముందుకు వచ్చి రక్తదానంలో పాల్గొంటే, సమాజంలో కొత్త స్ఫూర్తి కలుగుతుంది. ఒక్క చుక్క రక్తం అనేక ప్రాణాలను కాపాడగలదనే అవగాహనను ప్రతి ఇంటికి తీసుకెళ్ళాలి" అని ఆయన పిలుపునిచ్చారు."రక్తదానం అంటే రక్త సంబంధం""ఒక చుక్క రక్తం ? లక్ష ప్రాణాలకు వెలుగులు""రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలుద్దాం""రక్తదానం చేద్దాం ? మరొకరి ప్రాణాన్ని కాపాడుదాం"జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మదు గారు సేవా భావం కలిగిన ప్రతి ఒక్కరిని ఈ మహత్తర రక్తదాన ఉద్యమంలో భాగస్వాములవ్వాలని, ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని చరిత్ర సృష్టించాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి సేవా తత్త్వం ఎల్లప్పుడూ "సేవే మంత్రం ? సమాజ సేవే పరమ లక్ష్యం" అనే సిద్ధాంతం చుట్టూ తిరుగుతుందని అభిరుచి మదు పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్, ఫిట్ భారత్, బ్లడ్ డొనేషన్ వంటి మహత్తర కార్యక్రమాలు ఆయన ఆలోచనల ప్రతిబింబం. మోదీ గారి పుట్టినరోజు నాడు రక్తదానాన్ని మహోత్సవంలా నిర్వహించడం ద్వారా, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే సంకల్పం మరోసారి నెరవేరుతుందని అన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**